క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ సతీష్‌బాబు

కురిచేడు: మండలంలోని గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సతీష్‌బాబు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ప్రతి సర్పంచ్, కార్యదర్శి వారి గ్రామాల అభివృద్ధి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధన దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుని పనిచేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తుల కోసం నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి



చిన్నారులతో వ్యాయామం చేయిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

పెద్దారవీడు: దివ్యాంగులు ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు ఎంపీపీ (డిపెప్) పాఠశాల భవిత కేంద్రంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గురువారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరానికి చిన్నారులను తీసుకొచ్చి వ్యాయామాలు చేయించుకొని మెరుగైన ఫలితాలు పొందవచ్చని తల్లిదండ్రులకు సూచించారు. కుర్చోవడానికి, నిలబడటానికి, నడవడానికి ఇబ్బందులు పడుతూ శారీరకంగా మానసికంగా ఉన్న చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు క్రమం తప్పకుండా చిన్నారులతో వ్యామామాలు చేయిస్తే త్వరగా అంగవైకల్యం నయం చేసుకోవచ్చని చెప్పారు. ఐఈఆర్టీస్ డి.బీబీ, బాలవర్ధిరాజు, 10 మంది చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

కురిచేడు: నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్‌ను తహసీల్దార్ జి.రజనీకుమారి గురువారం విడుదల చేశారు. మండలంలోని సాగర్ కాలువ పరిధిలో 6 మేజర్లు, మైనర్‌చెరువులు మూడు ఉన్నాయని, వాటికి ఈ నెల 14 తేదీన ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పడమరవీరాయపాలెం, కల్లూరు, పడమరనాయుడుపాలెం, ముష్టగంగవరం, పడమరవీరాయపాలెం-2, బయ్యవరం మేజర్లతో పాటు కల్లూరు, ఆవులమంద, పడమరనాయుడుపాలెం మైనర్ చెరువులకు సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల ప్రక్రియ ఉదయం 8 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. ఉదయం 8 గంటలకు సర్వసభ్య సమావేశం, 9 గంటలకు ఓటర్లను ఎన్నికల కేంద్రానికి అనుమతి, 9.15 వరకు సంఘాల ప్రధాన ఉద్దేశాలు, ఏకాభిప్రాయం గుర్తింపు, 9.15–9.45 ఏకాభిప్రాయం లేని చోట ఎంపికను స్లిప్పులు లేదా చేతులు ఎత్తడం ఉంటుంది. 9.45–10.15 వరకు నామినేషన్ల ప్రక్రియ, 10.15–10.30 వరకు నామినేషన్ల పరిశీలన, 10.30–12.30 వరకు పోలింగ్, 1 గంటకు స్లిప్పుల లెక్కింపు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగుతందని ఎన్నికల అధికారి రజనీకుమారి వివరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు: ఐసీడీఎస్‌కు సంబంధించి తాళ్లూరు సెక్టార్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 3 ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ జ్యోతి గురువారం ఓ ప్రకటనలో కోరారు. తురకపాలెంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఓసీ జనరల్), రామభద్రాపురంలో 1 ఆయా పోస్టు (ఓసీ మహిళ), తాళ్లూరులో ఒక ఆయా పోస్టు (ఎస్సీ మహిళ), గంగవరంలో (ఓసీ మహిళ) ఆయా పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులను దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

అధ్వానంగా నల్లమల రోడ్డు



దొంగల వాగు వద్ద మార్జిన్ ఇలా..



దొంగల వాగులో పడిన లోడు లారీ (ఫైల్)

- మార్జిన్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- భయాందోళనలో వాహనదారులు

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలోని జాతీయ రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్డుపై సైడు మార్జిన్లు సరిగా లేక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నల్లమల రోడ్లు ఇలాగే ఉండిపోతున్నాయి. ముఖ్యంగా మోట్ల మల్లికార్జునపురం నుంచి రోళ్లపెంట మధ్య రహదారులపై పెద్ద పెద్ద గుంతలు వాహదారులకు ఇబ్బంది కరంగా మారాయి. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో మార్జిన్లు సైతం సరిగా లేకపోవడంతో ఈ రహదారులపై వెళ్లే వాహనాలు తరుచూ మరమ్మతుకు గురవుతుండగా మరికొన్ని వాహనాలు గుంతల్లో ఇరుక్కున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.

సరిహద్దు ప్రాంతంతో తలనొప్పి

జిల్లా సరిహద్దు ప్రాంతమైన పెద్దదోర్నాల మండల పరిధిలోని కర్నూల్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన రోళ్లపెంట వరకు రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉంది. పెద్దదోర్నాల నుంచి నంద్యాల జిల్లా ఆత్మకూరు వరకు మొత్తం 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. అయితే అందులో ప్రకాశం జిల్లాలోని రోళ్లపెంట వరకు జిల్లా పరిధి 30 కిలో మీటర్లు మాత్రమే. అయితే మన జిల్లా పరిధిలోని మోట్ల మల్లికార్జునపురం నుంచి రోళ్లపెంట వరకు రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఏటా టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు రోడ్లకు మరమ్మతులు చేస్తుంటారే తప్ప మార్జిన్లను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడంటూ వాహనదారులు వాపోతున్నారు. మార్జిన్లు సరిగా లేకపోవటంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయిని వాపోతున్నారు. గతంలో దొంగలవాగు పొంగిన నేపథ్యంలో ఈ మార్గంలో ప్రమాణిస్తున్న ఓ లోడు లారీ మార్జిన్లు లేక వాగులో పడి పోవటంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పాటు అదే ప్రాంతంలో చిలకచర్ల గూడేనికి చెందిన దంపతులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ మార్జిన్లు లేకపోవటంతో అదే వాగులో పడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలా తరుచూ ఏదో ఒక ప్రమాదం జరుగుతుండటంతో వాహన దారులు భయాందోళలనకు గురవుతున్నారు. దీంతో పాటు రోడ్లపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. అధికారులు జోక్యం చేసుకుని ఇబ్బందులు తొలగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పంటకోత, విలువల జోడింపుపై అవగాహన



దొనకొండ: వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: పంటకోత, ఆ తర్వాత పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోడం, వాటి నిర్వహణతో పాటు వాటి విలువ జోడింపు చేసుకుంటే అధిక ధరలకు అమ్ముకోవచ్చని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. పంట నిల్వల జోడింపుపై స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతులకు శిక్షణ ఇచ్చారు. మండలంలో సజ్జలు ఎక్కువగా పండించారని, వాటిని ముడి సరుకుగా వాడుకుని విలువ జోడింపుతో మార్చుకుంటే అధిక ధరలకు అమ్ముకోవచ్చున్నారు. సజ్జ ఉత్పత్తులు సంగటి, బూరెలు, పేలాలు, హల్వా, లడ్డూ, దోసెల రూపాల్లో నిల్వ ఉంచుకుని వాడుకునే విధంగా చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. ఏపీఎం పి.దేవరాజ్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

దొనకొండ: కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ కింద సాగు చేసిన వరి కోతలను తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. ఈ ఏడాది సుమారు 600 ఎకరాల్లో చందవరం, బట్టేపాడు, దేశిరెడ్డిపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో వరి సాగు చేశారని, ఇప్పటికే సుమారు 50 ఎకరాల్లో వరి కోసి క్వింటా రూ.1400కు అమ్ముతున్నట్లు తెలిపారు. రైతులు తొందరపడి మధ్యవర్తులకు అమ్ముకోవద్దని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత వరి కోతలు ప్రారంభించి మద్దతు ధరకు అమ్ముకోవాలని, త్వరలో వరి కొనుగోలు కేంద్రాన్ని చందవరం రైతు సేవా కేంద్రంలో ప్రారంభిస్తామని ఏఓ తెలిపారు. ఆయన వెంట సురేంద్ర, విన్నీబాబు, రైతులు ఉన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- వరి ధాన్యం పరిశీలన



రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు

ముండ్లమూరు (దర్శి): ప్రభుత్వమే ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని పసుపుగల్లు గ్రామంలో గిట్టుబాటు ధరల పై రైతులతో ముఖాముఖి కార్యక్రమం గురువారం నిర్వహించారు. వరి ధాన్యం కళ్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో బస్తా రూ.2 వేలకు కొనుగోలు చేస్తే ఇప్పుడు దళారులు రూ.1400కు మాత్రమే కొంటున్నారని రైతులు ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వంలో తమను చంద్రబాబు నిలువునా మోసగించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాన్‌కు ఈ ప్రాంతంలో వరి, సజ్జ, జొన్న వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయినా ఇప్పటికీ నష్ట పరిహారం అందించలేదని చెప్పారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ధాన్యం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని మాయ మాటలు చెప్పిన ప్రభుత్వం దోపిడీదారులను పెంచి పోషిస్తోందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ప్రకటనలు చేయడమే కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని చెప్పారు. కనీసం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే గిట్టు బాటు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మాజీ జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, మాజీ మండల కన్వీనర్ సూది దేవర అంజయ్య, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు బంకా నాగిరెడ్డి, గొంది అప్పిరెడ్డి, గర్నెపూడి ప్రసన్న కుమార్, కృష్ణారెడ్డి,కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



పెద్దారవీడు: మాట్లాడుతున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్



దొనకొండ: అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్

పెద్దారవీడు: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలోని కంభంపాడు ఎంపీపీ పాఠశాల అవరణలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. భూ యజమానులు అర్జీ రూపంలో సమస్యలను అధికారులకు వివరించాలని కోరారు. రైతులు ఇచ్చిన భూ సమస్యలపై అర్జీలను అధికారులు స్వీకరించి రసీదులు ఇచ్చారు. ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో సంజీవరెడ్డి, కంప్యూటర్ అపరేటర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దొనకొండ: భూముల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని తహసీల్దార్ బి.రమాదేవికి బాదాపురం గ్రామ రైతులు అర్జీలు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూముల ఆన్‌లైన్ కోసం 41 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటి తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్ఓ మాచర్ల, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా నిలుద్దాం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాతగా అండగా నిలుద్దామని ఆ పార్టీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. రైతులను దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు శుక్రవారం జిల్లా కేంద్రమైన ఒంగోలులో జరిగే ఆందోళనకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ర్యాలీ, కలెక్టర్ కార్యాలయంలో విజ్ఞాపన పత్రం అందజేస్తామని, ఆయా కార్యక్రమాల్లో రైతులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉదయం 8 గంటలకు స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి ఒంగోలుకు బయల్దేరుదామని ఎమ్మెల్యే తాటిపర్తి పిలుపు ఇచ్చారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులు బైండోవర్



వ్యాపారులను బైండోవర్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

కురిచేడు: మండలంలోని ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి తిరిగి అలాంటి నేరం చేయకుండా ఉండేందుకు స్థానిక తహసీల్దార్ వద్ద హాజరు పరచి రూ.రెండు లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా మద్యం అక్రమంగా నిల్వచేసినా విక్రయించినా వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

- విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

దర్శి: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. డివిజన్ పరిధిలోని సిబ్బందితో విద్యుత్ ప్రమాదాల గురించి గురువారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి సిబ్బంది తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ బకాయిలు వెంటనే వసూలు చేయాలన్నారు. విద్యుత్ చౌర్యం జరగకుండా చూసుకోవాలని సూచించారు. గృహ వినియోగదారులకు పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ కింద ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ అమర్చుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక కేవీకి రూ.30 వేల సబ్సిడీ, రెండు కేవీలకు రూ.60 వేల సబ్సిడీ, మూడు కేవీలకు రూ.78 వేలు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ వస్తుందన్నారు. నిరంతరాయంగా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అయ్యే విధంగా, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే విధంగా ప్రణాళికలు ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు దిశానిర్దేశం చేశారు. డివిజన్ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీటీఎస్ సీఐ బీటీ నాయక్, డివిజన్‌లోని డీఈఈలు, ఏఈలు సిబ్బంది హాజరయ్యారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

దొనకొండ: గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విద్యుత్ ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసులు, విజిలెన్స్ ఈఈ టి.హైమావతి హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై జరిమానా విధించి అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో అడవి పందుల నివారణకు కరెంట్ కంచె వేస్తున్నారని, అలా వేస్తే ప్రాణాపాయం జరిగితే కుటుంబాలే నష్టపోతాయని పేర్కొన్నారు. నేటికీ జిల్లాలో 56 మంది విద్యుత్ ప్రమాదాలకు గురై మృతి చెందారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను దొంగలించి రైతులకు ఇబ్బంది చేసే వారని గుర్తించాలని చెప్పారు. అలాంటి వారు గ్రామాల్లో సంచరిస్తుంటే సంబంధిత విద్యుత్ శాఖకు తెలియజేయాలని కోరారు. విద్యుత్ మీటర్‌కు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యుత్ అధికారుల దాడులు

మండల పరిధిలోని గ్రామాల్లో ఏఈ షేక్ నాగూర్ ఆధ్వర్యంలో అధికారులు 42 బృందాలుగా ఏర్పడి విజిలెన్స్ దాడులు నిర్వహించారు. 3,065 సర్వీసులను తనిఖీ చేసి అక్రమ విద్యుత్, అధిక లోడు వినియోగిస్తున్న 10 మందిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ దాడుల్లో డీఈఈలు హరిబాబు, కృష్ణారెడ్డి, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, 11 మంది ఏఈలు పాల్గొన్నారు.

పునాది విద్యతోనే విద్యార్థి భవిష్యత్



సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్, విశ్రాంత తహసీల్దార్, స్థల దాత

పెద్దారవీడు: విద్యార్థి భవిష్యత్‌ను పునాది అభ్యాసనమే నిర్దేశిస్తుందని మార్కాపురం నవోదయ ప్రిన్సిపాల్ టీవీ గణేష్‌కుమార్ అన్నారు. రాజంపల్లి సమీపంలోని కేంద్రియ విద్యాలయంలో ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్ అధ్వర్యంలో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గ దర్శకులవుతారని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను పొందాల్సి ఉందన్నారు. చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచి మంచి నడవడికను అలవర్చుకోవాలని, చిన్నప్పటి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకొని చదవుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న విద్యార్థుల మనస్థత్వాలను జాగృతి పరిచే దశగా ఉండాలన్నారు. విశ్రాంతి తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో స్థల దాత ఉయ్యూరి సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

దర్శి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన 90 మంది విద్యార్థులకు రాత మెటీరియల్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.రంగారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. గురువారం స్థానిక ఆ పాఠశాలలో ఏకేఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అట్లూరి రామారావు తల్లి కోటిలింగమ్మ 21వ వర్ధంతి సందర్భంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మెటీరియల్‌ను అట్లూరి రామారావు అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పిల్లలకు రాత మెటీరియల్ ఇచ్చిన రామారావును అభినందించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కేవలం విద్యకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. బీకేఎంయూ రాష్ట్ర నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి.అవనీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కేంద్రాల పరిశీలన



వరి ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న వరలక్ష్మి

త్రిపురాంతకం: మండల పరిధిలోని ఎండూరివారిపాలెం, విశ్వనాథపురం, వెల్లంపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, వ్యవసాయాధికారి నీరజ గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం 17 తేమ శాతం ఉండేలా ఆరబెట్టుకుంటే కొనుగోలు కేంద్రాలు ద్వారా అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. రైతులకు కావాల్సిన గన్ని సంచులు, హమాలీ చార్జీలు, రవాణా చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ద్వారా లబ్ధి పొందాలన్నారు.